పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- డోన్‌ను ఆదర్శంగా నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి





ఎద్దుపెంట - మిద్దెపల్లె రహదారిపై పాదయాత్ర నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన, నక్కవాగుపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన

డోన్ : పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నది తన ధ్యేయమని, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యనిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. మండలంలోని మిద్దెపల్లె – ఎద్దుపెంట గ్రామాల మధ్య 3.80 కిలోమీటర్ల మేర రూ.2.50కోట్లతో నిర్మించిన రోడ్డును ఆదివారం మంత్రి బుగ్గన ప్రారంభించారు. అనంతరం రోడ్డు వెంట పాదయాత్ర నిర్వహించారు. తదనంతరం తిరునాంపల్లె, నక్కవాగులపల్లె, కొత్తకోట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల్లో ఆర్థిక అసమానతలను తొలగించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఆ దిశగా కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తిరుమలరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దుపెంట నరసింహారెడ్డి, మల్యాల భాస్కర్‌రెడ్డి, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ అధికారులపై మంత్రి ఆగ్రహం

మండల పరిధిలోని గుండాలలో రూ.10కోట్లతో చేపట్టిన స్తోత్రం గుండాల లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను మంత్రి పరిశీలించారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై మంత్రి బుగ్గన దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది గడిచినా పనుల్లో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. ఆగస్టు చివరికి గర్భగుడి, టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మించాలని మంత్రి ఆదేశించారు.

పరామర్శ

డోన్ మండలంలో ఆదివారం విస్తృతంగా పర్యటించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తాడూరు గ్రామంలో బోయ లక్షప్ప కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడూరు లక్షప్పను చూసి మంత్రి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. లక్షప్ప కుమారుడు, మండల ఉపాధ్యక్షుడు యర్రిస్వామితో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్షప్ప కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు.

‘కియా’ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి బుగ్గన



శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో కియా కార్ల కంపెనీ ఏర్పాటు చేస్తున్న ఉపాధి శిక్షణా కేంద్రాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ఆ కంపెనీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కబ్ డాంగ్‌లీతో కలిసి ఆదివారం పరిశీలించారు. కియా కార్ల కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేస్తున్న శిక్షణా కేంద్రాన్ని సోమవారం కంపెనీ ఎండీ తా జిన్ పార్క్ , హెడ్ ఆఫ్ ది లీగల్ అఫైర్ అధికారి యోంగీలీ మాతో కలిసి మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు. ఇప్పటికే రూ. 2 కోట్ల విలువగల శిక్షణకు అవసరమయ్యే మిషనరీలను కంపెనీ ఏర్పాటు చేసింది. ఏటా 30 మందిని నైపుణ్యంగా తీర్చిదిద్ది కంపెనీలో ఉపాధి కల్పిస్తారని మంత్రి బుగ్గన ఈ సందర్భంగా తెలిపారు. విద్యావంతులైన యువకుల కోసం ఉపాధి శిక్షణా కేంద్రాన్ని కియా కంపెనీ ఏర్పాటు సంతోషకరమని మంత్రి కంపెనీ ప్రతినిధులను అభినందించారు.

ఇద్దరు కానిస్టేబుళ్లు బదిలీ

కొలిమిగుండ్ల: సాధారణ బదిలీల్లో భాగంగా కొలిమిగుండ్ల పోలీస్ స్టేషనలో విధులు నిర్వహించే ఇద్దరు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి బదిలీ చేశారని ఎస్‌ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. స్టేషన్‌లో ఐదేళ్ల పాటు సర్వీసు పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు మహబూబ్ హుశేన్ బేతంచెర్లకు, సుధాకర్‌ను అవుకు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారని తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఎంపీడీఓగా పదోన్నతి

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాజుకు ఎంపీడీఓగా పదోన్నతి కల్పిస్తు ఆదివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది క్రితం మహానంది నుంచి కొలిమిగుండ్లకు బదిలీపై వచ్చిన ఆయన ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వం ఎట్టకేలకు పదోన్నతులు కల్పించింది. రెండేళ్ల నుంచి పదోన్నతి కోసం ఎదురు చూస్తుండేవాళ్లమని, కల నెరవేరిందని ఎంపీడీఓ సుబ్బరాజు సంతోషం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

పాలుట్ల రంగస్వామికి వెండి దీపాలు బహూకరణ



వెండి దీపాలు ఆలయ అర్చకునికి అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామ సమీపాన కొండలో వెలసిన పాలుట్ల రంగస్వామికి భక్తులు వెండి దీపాలు బహూకరించారు. హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన తెలుగు నడిపి రంగయ్య, పుల్లమ్మ జ్ఞాపకార్థం కొడుకు తెలుగు వెంకటేశ్వర్లు, నాగేశ్వమ్మ దంపతులు రూ.30 వేల వెండి దీపాలను అర్చకుడు విష్ణువర్దన్ ఆచార్యులకు అందజేశారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం దాతలకు అర్చకుడు తీర్థ ప్రసాదలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు

సంజామల: మండలంలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామవాసి నంద్యాల గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి ఆర్థిక సహకారంతో ప్రతినెలా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. డాక్టర్లు బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు గుండె సంబంధిత చర్మ వ్యాధులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మౌలాలి రెడ్డి, షేక్షావలిరెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక సచివాలయం ఉద్యోగి మృతి

డోన్ టౌన్: పట్టణ పరిధిలోని చింతలపేట గ్రామ సచివాయంలో విద్యుత్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న అల్లుగుంటి మల్లికార్జున (25) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని ఆవులదొడ్డి గ్రామానికి చెందిన మల్లికార్జున చింతలపేట సచివాలయంలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 25న ఇంటిలో క్రిమి సంహారక మందు ప్లాస్టిక్ బాటిళ్లో ఉండటంతో పొరపాటున నీరు అనుకుని తాగడంతో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడి తల్లి సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విజయ థియేటర్‌లో అగ్ని ప్రమాదం



థియేటర్‌లో మంటలు చేలరేగుతున్న దృశ్యం

డోన్ టౌన్: మూతబడిన విజయ థియేటర్‌లో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలో ఉన్న విజయ థియేటర్ గత కొద్దిసంవత్సరాలుగా మూతబడి ఉండటంతో చెత్తచెదారం పేరుకపోయింది. ఈ క్రమంలో ఆదివారం చెత్తకు నిప్పు రగులుకోని మంటలు థియేటర్‌కు వ్యాపించి సీట్లు తగలబతుండగా పొగలు బయటకు వచ్చాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, యజమాన్యానికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

అవుకు: మండల పరిధిలోని పాత చెర్లోపల్లె గ్రామంలో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. రిజర్వాయర్ సమీపాన ఉన్న పాత చెర్లోపల్లె గ్రామంలోని పాఠశాల గదిలో దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి సమాచారం అందించారన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతి చెందినది మహిళ వయసు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. చనిపోయి దాదాపు ఐదు రోజులు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట సాగు చేయాలనుకున్న రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం సమీప రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. 40 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేయడం జరుగుతుందని, కే6 వేరుశనగ రకం సబ్సిడీపోను రూ. 5,580, కదిరి లేపాక్షి రకానికి రూ.4,980 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఐకమత్యంతో అభివృద్ధి



జూనూతల గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని జూనూతల గ్రామ ప్రజలతో ఆదివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తారతమ్య బేధాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉన్నప్పుడే గ్రామం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కార చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి గ్రామంలో పర్యటించారు. తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తిచేసి తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే శ్రీఆంజనేయ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరిందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆలయ పునర్నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సన్మానించిన దృశ్యం

డోన్ టౌన్ : పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనభరచిని ఆరవైశ్య విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను ఆవోపా నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం డోన్ ఆవోపా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం కృష్ణకిషోర్, జోన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి ఆధ్వర్యంలో విద్యార్థులకు శాలువ కప్పి మెమోంటో అందజేసి సన్మానించారు. అత్యధికంగా మార్కులు సాధించిన మాకం హర్షిత(589), రాజా మన్విత్ సుబ్రహ్మణ్యం (585), ఉత్కూరు కళ్యాణ్‌కుమార్‌కు (580) నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అదేవిధంగా 500 మార్కులుపైబడి సాధించిన 22 మందికి కన్సోలేషన్ బహుమతులుగా ఒక్కొక్కరికి రూ.500 అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు సత్కారించామని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

విద్యా సహాయ నిధికి రూ.5116 విరాళం

ఆర్యవైశ్య సంక్షేమ సంఘం, ఆవోపా సంఘాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పేద ఆర్యవైశ్య విద్యార్థులకు అందించే సహాయ నిధికి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఎల్‌ఐసీ ఏజెంట్ ఆర్‌సీ సుబ్రహ్మణ్యం రూ.5116 విరాళంగా అందజేశారు. దాతను సంఘాల నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు.

ఐకమత్యంగా మెలగాలి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏరుకల సేవా సంఘం నాయకులు

బనగానపల్లెరూరల్: ఎరుకల కులస్తులు ఐకమత్యంగా మెలగాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. పట్టణంలో ఆదివారం ఏపీ ఎరుకల సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షుడిగా ఈసారి పెద్ద రాముడు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈసారి కుమార్, రాయలసీమ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఈసారి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా డేగల విఘ్నేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపుర్వకంగా ఆయన స్వగృహంలో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఎరుకలి సామాజికవర్గం అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. వాటిని సద్వినియోగం చేసుకుని మీ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు ఈసారి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహ భావంతో మెలగాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్

అవుకు: ప్రజలు, పోలీసులు స్నేహభావంతో మెలగాలని, అప్పుడే నేరాలను అరికట్టడానికి సలువు అవుతుందని ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపారు. మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో ఎస్‌ఐ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్‌క్రైం, పనులు....ఊర్లకు వెళ్లేటప్పుడు జరిగే దోపిడీల తీరును వివరించిన ఎస్‌ఐ రోడ్డు ప్రమాదాలు జరుగుతన్న తీరును విశదీకరించారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, వీలునకానప్పుడు పోలీసులను ఆశ్రయించాలే తప్పా ఘర్షణలకు పాల్పడ కూడదని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నందునాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అవుకు: మండల పరిధిలోని రామాపురంలో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురానికి చెందిన షేక్ రాజు హుస్సేన్(38) ట్రాక్టర్ లోడింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే తాగుడుకు భానిస అయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో భార్యను బంగారం వస్తువులు ఇవ్వాలని అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో కొట్టి ఇంట్లో ఉంచి తలుపులు వేశాడు. ఈ నేపథ్యంలో బయట ఉన్న రేకుల షెడ్డు పైపునకు నవారు తాడుతో ఉరి వేసుకున్నాడు. ఆమె బయటకు చూడగా భర్త వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతన్ని కిందకి దించి చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య షేక్ మహబూబ్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరేంద్ర కుమార్ తెలిపారు.

వీరసావర్కర్ జయంతి

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం వీరసావర్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భారత మాత, వీర సావర్కర్ చిత్రపటాలకు వికాస భారతి సంఘటన నాయకులు పూలమాలలు వేశారు. వీర సావర్కర్ త్యాగాలను సంఘటన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్,వక్తలు శివ ప్రసాద్, యుగంధర్, పట్టణ ప్రముఖులు హుసేన్‌రెడ్డి, గుండా గోపాలు, మారుతి శర్మ గుర్తు చేశారు. కార్యక్రమంలో వికాస భారతి, సురభి గోశాల, సమరసతసేవా ఫౌండేషన్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు చంద్రమౌళీశ్వర్ రెడ్డి, నాగ మోహన్, మధు మోహన్‌రెడ్డి, బచ్చు సుబ్రహ్మణ్యం, మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ముస్లింల చేరిక



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని 6 వార్డుకు చెందిన ముస్లిం మైనార్టీలు రహిమాన్, అబ్దుల్‌ఖాదర్, హమీద్, షంషీర్, సత్తార్, ఖాదర్‌బేగ్ తదితరులు ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి కాటసాని పార్టీ కండువ వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు పార్టీలు, కుల మతాలకు అతీతంగా అందిస్తుండడంతో ఆకర్షితులమై చేరామని వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం యువకులు తెలిపారు. ఇక నుంచి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని, సముచిత స్థానం కల్పించి తగిన న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్, జీటి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఈరోజు

నేడు వాహనాల వేలం

కొలిమిగుండ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. నాలుగు ప్లాటినా, స్ప్లెండర్ ప్లస్, స్టార్ సిటీ బైక్‌లు ఒకటి చొప్పున మొత్తం ఆరు బైక్‌లకు నంద్యాల ఆర్టీవో నిర్ణయించిన ధరల ప్రకారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వ్యక్తులు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన వచ్చని చెప్పారు. వాహనాలు దక్కించుకున్న తర్వాత జీఎస్టీ అదనంగా 18 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వలంటీర్లకు సత్కారం

అవుకు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం వలంటీర్లకు సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లకు సేవా వజ్ర, సేవ రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 3గంటకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

బైక్ ర్యాలీ

బనగానపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు తనయుడు కాటసాని ఓబులరెడ్డి పాల్గొంటారన్నారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన పెద్దగుడి నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై అప్పలాపురం, కైప, బనగానపల్లె పట్టణం మీదుగా అవుకు మెట్ట వరకు సాగుతుందన్నారు. అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తారని, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కన్వీనర్లు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మోడ్రన్ ల్యాబ్ ప్రారంభించనున్న మంత్రి

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని మోడ్రన్ ల్యాబ్‌ను సోమవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ బద్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కియా మోటార్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌ను ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యావంతులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా ఎన్‌టీఆర్ శత జయంతి

డోన్ టౌన్ : దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ శత జయంతిని ఆదివారం సినీ హీరోలు బాలకృష్ణ, జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ ఫ్యాన్స్ అభిమానుల సంఘం అధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో స్థానిక శేగు థియేటర్ సమీపంలో ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానుల సంఘం గౌరవ అధ్యక్షుడు సోమన్నగౌడ్, ఉపాధ్యక్షుడు ఖాసీం, నాయకులు సురేంద్రగౌడ్, కటారుకొండ శేఖర్, నాగన్న, మధు, మంజు, ప్రదీప్, శివ, ఆరవింద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ రెడ్డి ఆశయాలు కొనసాగిస్తాం



దివంగత చల్లా భగీరథ రెడ్డి సమాధికి నివాళులర్పిస్తున్న చల్లా శ్రీలక్ష్మీ, బంధువులు

అవుకు: దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని, ఆయన సతీమణిగా అది నా భాధ్యతని అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ తెలిపారు. భగీరథ రెడ్డి 47వ జయంతి వేడుకల సందర్భంగా అవుకు పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా తాడిపత్రి రహదారిలోని చల్లా ఫామ్‌హౌస్ వద్దకు కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణా రెడ్డి, బంధువులు చల్లా ప్రభాకర్ రెడ్డి, చల్లా రామేశ్వర్ రెడ్డి, చల్లా ఉమా, చల్లా సుజాత, చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, చల్లా కీర్తి తదితరులతో కలిసి వెళ్లారు. దివంగతనేత చల్లా రామకృష్ణా రెడ్డి, అలాగే దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి సమాధులకు పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో చల్లా భగీరథ రెడ్డి పేరుమీద ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను చల్లా శ్రీలక్ష్మీ ప్రారంభించారు. అదేవిధంగా స్థానిక చల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో విజయ బ్లెడ్ బ్యాంక్ నంద్యాల ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమెతోపాటు నియోజకవర్గమే కాకుండా గుత్తి, కర్నూలు నుంచి వచ్చిన చల్లా అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చల్లా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ నా భర్త బనగానపల్లె నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేయాలని ఆశించేవారని, ఆయన ఆశయాల సాధనను భాధ్యతగా స్వీకరించానన్నారు. రక్తదానం చేసిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ రవికుమార్, అవుకు సర్పంచ్ మందా గుర్రమ్మ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తొగట సురేశ్ బాబుకు ఎన్టీఆర్ శతకరత్న పురస్కారం



తొగట సురేశ్‌బాబుకు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

ప్యాపిలి: రాచర్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ తొగట సురేశ్ బాబుకు ఎన్టీఆర్ శతకరత్న పురస్కారం లభించింది. ఆదివారం బెంగళూరులోని శ్రీకృష్ణదేవరాయ కళాప్రాంగణంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. శతక రచన పోటీల్లో డాక్టర్ సురేశ్‌బాబు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబును నిర్వాహకులు ఘనంగా సన్మానించి ఎన్టీఆర్ శతకరత్న పురస్కారాన్ని, రూ. 10 వేలు నగదు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ‘లలిత గంభీర నటనావిరాజమూర్తి’ పేరుతో సురేశ్‌బాబు రచించిన శతక పుస్తకాన్ని నిర్వాహకులు ఆవిష్కరించారు. ఎన్టీఆర్ శతక పురస్కారాన్ని అందుకున్న సురేశ్‌బాబును రాచర్ల ఉన్నత పాఠశాల సిబ్బంది అభినందించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కోవెలకుంట్ల: నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై ఆదివారం అదనపుకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కుమార్తె లలితను నంద్యాల మండలం చాబోలుకు చెందిన రాంబాబుతో ఏడాది క్రితం వివాహం జరిపించారు. కట్నకానుకల రూపంలో నగదు అందజేశారు. కొంతకాలం వారి దాంపత్య జీవితం సజావుగా కొనసాగింది. అదనపుకట్నం తేవాలని కొన్ని రోజుల నుంచి భర్తతోపాటు అత్త జయమ్మ, ఆడపడుచు రమాదేవి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. పుట్టింటికి చేరుకున్న బాధిత మహిళ లలిత ఫిర్యాదు మేరకు భర్త, అత్త, ఆడపడుచుపై 498ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భగవంతుని నామస్మరణతో మోక్షం



విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: భగవంతుని నామస్మరణతో మోక్షం కల్గుతుందని పూదోట ఆశ్రమ నిర్వాహకులు గుండాగోపాలు, గౌరి హుసేన్‌రెడ్డి, భజనకృష్ణయ్య, డాక్టర్ నరసింహులు అన్నారు. పట్టణంలోని పూదోట ఆశ్రమంలో లోక కల్యాణార్థం చేపట్టిన విష్ణు సహస్ర నామ స్తోత్ర సామూహిక పారాయణం ఆదివారం కొనసాగింది. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. జూన్ 30 వరకు పారాయణం కొనసాగుతుందని, భక్తులు పాల్గొని భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు. అన్నదానం కార్యక్రమానికి దాతలు దాతలు మురళీ కృష్ణ, ఇల్లూరు చంద్రమౌళి విరాళం అందజేశారు.